క్లుప్తంగా

‘గీతన్న బంధు’ను ప్రకటించాలి



ములుగు రూరల్(గోవిందరావుపేట): ప్రభుత్వం దళితబంధు తరహాలో గీతన్న బంధును ప్రకటించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వచ్చువాయి సారయ్య అన్నారు. ఈ మేరకు గురువారం గోవిందరావుపేటలో కల్లుగీత కార్మికులతో కలిసి మాట్లాడారు. కల్లుగీత కార్మికులకు ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ తేడా లేకుండా కార్మికులకు బీమా వర్తింప చేయాలని అన్నారు. వృత్తిరీత్యా ప్రమాదాల బారినపడి దివ్యాంగులుగా మారిన వారికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు గురైన వారికి వైద్య ఖర్చులు ప్రభుత్వం భరించాలన్నారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎలేంద్ర, సారయ్య, సదయ్య, ఐలయ్య, సదానందం, ఆంజనేయులు, రాముడు, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చిడతల రామాయణం ప్రదర్శన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో శుక్రవారం నుంచి చిడతల రామాయణం ప్రదర్శన చేస్తున్నట్లు పలుగుల భక్త మండలి ఒక ప్రకటనలో తెలిపారు. చిడతల రామాయణం ప్రదర్శన గురువు దుర్గం సడవలయ్య ఆధ్వర్యంలో రామాయణంలో పాత్రల ఈనెల 9వరకు ప్రతిరోజు సాయంత్రం 6గంటల నుంచి ప్రదర్శించనున్నారని తెలిపారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

టేకుమట్ల: ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే బహుజనుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు సంగి రవి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భరోసా సభకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి హాజరు కానున్నట్లు తెలిపారు. కావున ప్రతి బహుజనుడు హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మాడుగుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, కోశాధికారి కొలుగూరి సదానందం, సెక్టార్ కో కన్వీనర్ సంగి రవి వర్మ, బెనర్జీ, దీక్షిత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

‘అవినీతి ఎమ్మెల్యేల పేర్లు బహిర్గతం చేయాలి’

భూపాలపల్లి అర్బన్: దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల వివరాలు, పేర్లు బహిర్గతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేద్కర్ సెంటర్‌లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. దళిత బంధు పథకంలో ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడినట్లు సీఎం కేసీఆర్ మాట్లాడటం సిగ్గు చేటుగా ఉందన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.రెండు నుంచి రూ.మూడు లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోర్నాల భరత్, రాజ్‌కుమార్, శ్రావణ్, రాజు, శ్రావణ్ పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ ద్వారా అనేక సేవలు

మొగుళ్లపల్లి: పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు అనేక సేవలు అందుతున్నాయని పోస్టల్ శాఖ పరకాల సబ్ డివిజన్ అధికారి రామ్మూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయంలో మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి భారత ప్రభుత్వం ఈ పథకం తీసుకొచ్చిందన్నారు. రూ.వెయ్యి నుంచి రెండు లక్షల డిపాజిట్ చేసుకోవచ్చని, ఈ డిపాజిట్‌పై రూ.7.5 శాతం వడ్డీ వస్తుందని తెలిపారు. పథకంపై విస్తృత ప్రచారం చేయాలని పోస్టల్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో మొగుళ్లపల్లి సబ్ పోస్ట్ మాస్టర్ క్రిష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

నరసింహ జయంతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని పెంటివాడలో నరసింహస్వామి జయంతి సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి భక్తులు భక్తిపాటలతో భజన కార్యక్రమం నిర్వహించారు.

నివాళి

మహదేవపూర్: మండలంలోని బెగుళూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఆకుల నారాయణ అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు గురువారం నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు.

ప్రారంభమైన సడాలమ్మ జాతర



కంకవనం తీసుకొస్తున్న భక్తులు



తరలి వచ్చిన భక్తులు

- గుడికి చేరిన వన దేవతలు

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడి గ్రామ సమీపంలోని గుట్టల వద్ద సడాలమ్మ జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. ముక్కిరి సరి గుట్ట నుంచి సడాలమ్మ వన దేవతలను గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో సన్నాయి వాయిద్యాల నడుమ తీసుకొచ్చారు. గుట్టపైకి చేరుకున్న తలపతి అక్కడ నుంచి వన దేవత సడాలమ్మను తీసుకు రాగా గుట్ట దిగిన వెంటనే గ్రామస్తులు, భక్తులు తమ సంప్రదాయం ప్రకారం సాదరంగా ఆహ్వానించారు. అక్కడ నుంచి దేవతను సడాలమ్మ దేవాలయానికి తీసుకొచ్చారు. దేవతను తీసుకొచ్చే సమయంలో భక్తులు నీల్లారబోసి మొక్కారు. గుడికి తీసుకొచ్చిన సడాలమ్మను భక్తులు, పూజారులు ప్రతిష్ఠించారు. అంతకు ముందు వనం కొట్టు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజన నృత్యాలతో రాత్రి మొత్తం జాతర తంతును కొనసాగగా.. శుక్రవారం భక్తులు మొక్కులు సమర్పించుకోనున్నారు.



సడాలమ్మను తీసుకొస్తున్న భక్తులు

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి



సమ్మెలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, జేపీఎస్‌లు

ఏటూరునాగారం: జూనియర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన జూ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన జేపీఎస్‌ల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని వారి కుటుంబాలకు కారుణ్య నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. శ్రీలతదేవేందర్, నర్సింహారావు, చిన్న ఎల్లయ్య, గౌస్, సులేమాన్ పాల్గొన్నారు.

నగర సంకీర్తనను విజయవంతం చేయాలి

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 06వ తేదీన నిర్వహించనున్న హనుమాన్ నగర సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురు స్వాములు పేరవేన శ్రీదర్, అరిగెల రవీందర్, ఇమ్మడి రమేష్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 06 గంటలకు నగర సంకీర్తన కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. ములుగు పట్టణంలోని రామాలయం నుంచి సీతారాములు, హనుమాన్ చిత్రపటాలను పట్టణంలో వీధుల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. ములుగు పట్టణంలో పాటు బండారుపల్లి, పాల్‌సాబ్‌పల్లి, మదవరావుపల్లి, ప్రేమ్‌నగర్ గ్రామాలలోని హనుమాన్ భక్తులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



సమావేశాన్ని బహిష్కరించిన ప్రజా ప్రతినిధులు



అధికారులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

వెంకటాపురం(కె): మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఐసీడీఎస్, అటవీశాఖ, పంచాయతీ రాజ్, రెవెన్యూ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు మాత్రమే హాజరు కావడంపై ప్రజా ప్రతినిధులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే మండలంలోని సమస్యలను ఎవరికి చెప్పాలని అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించేందుకు అధికారులు సహకరించడం లేదని జెడ్పీటీసీ పాయం రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అడ్డూరి బాబు, తహసీల్దార్ అంటి నాగరాజు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, అధికారులు ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు



శంకరాజుపల్లిలో హోమం చేస్తున్న గ్రామస్తులు



శంకరాజుపల్లిలో పూజలు చేస్తున్న పూజారులు



రాంపూర్‌లో ఏర్పాటు చేసిన శక్తిపీఠం

- శంకరాజుపల్లి, రామన్నగూడెంలో వేడుకలు
- నేడు బొడ్రాయి, పోతరాజు, భూలక్ష్మి ప్రతిష్ఠాపన

ఏటూరునాగారం: మండలంలోని శంకరాజుపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బొడ్రాయి ప్రతిష్ఠాపన కోసం గణపతి పూజ, మండపారాదాన కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించి ప్రత్యేకంగా తయారు చేసిన అష్టదిగ్బంధన కొర్రులను తయారు చేసి వాటికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం రాత్రి గ్రామ అష్టదిగ్బంధన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఎవరు గ్రామంలోకి రాకుండా ఉండేందుకు, గ్రామం నుంచి ఎవరు కూడా బయటకు పోకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. దీంతో అర్చకులు, సర్పంచ్‌లు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు ప్రత్యేక చొరవతో ఉత్సవాలను జరిపిస్తున్నారు. గ్రామాలు సుభిక్షంగా ఉండాలని ప్రజలు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున హాజరై హోమం వద్ద నవధాన్యాలను సమర్పించి వేడుకున్నారు. అర్చకులు ప్రజలకు ఆశీర్వచనం అందజేశారు. శంకరాజుపల్లి, రామన్నగూడెం శుక్రవారం ఉదయం బొడ్రాయి, పోతరాజు, భూలక్ష్మిలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈక్రమంలో ఇంటి ఆడబిడ్డలు, బంధులువు పెద్ద ఎత్తున తరలిరావడంతో గ్రామంలో సందడిగా నెలకొంది. కార్యక్రమంలో శంకరాజుపల్లి సర్పంచ్ అనుముల శకుంతల ముకుందరావు, బీఆర్ఎస్ నాయకుడు కూనూరు మహేష్, రాంబాబు, రామన్నగూడెంలో సర్పంచ్ దొడ్డ కృష్ణ, ఎగ్గటి కోటయ్య, రఘు, నాగేశ్వర్‌రావు, శ్రీధర్, బాబు, రాంబాబు పాల్గొన్నారు.

శక్తిపీఠం ఏర్పాటు

ములుగు రూరల్(గోవిందరావుపేట): మండలంలోని పస్రా పంచాయతీ పరిధి రాంపూర్‌లో నూతన బొడ్రాయి ప్రతిష్ఠాపనకు శక్తి పీఠాన్ని నిర్మించినట్లు ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ ఈదునూరి వెంకటపాపిరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొడ్రాయి ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తూ ఆర్థిక సాయం అందించిన పన్నాల శ్రీనివాస్‌రెడ్డికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన హోమం కార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు ముందస్తుగా కమిటీ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఎకకాలంలో అందరూ హోమంలో పాల్గొనడం సాధ్యం కాకపోవడంతో వేర్వేరుగా హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 పొలిమేర ద్వారములకు తోరణాలు అలంకరించి గణపతి పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి



అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

వెంకటాపురం(కె): విద్యుత్ ప్రమాదాలకు నివారణ కోసం కృషి చేస్తామని, ప్రజలు విద్యుత్‌ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ స్వామిరెడ్డి అన్నారు. గురువారం మండలం మండల పరిధిలోని చొక్కాల గ్రామంలో విద్యుత్ భద్రతా వారోత్సవాల అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యుత్ భద్రతపై అవగాహన పెంచడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. విద్యుత్‌ను అవసరాలకు అనుగుణంగా వాడుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పొలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. తొందరపాటున సొంతంగా నిర్ణయాలు తీసుకుంటే ప్రమాదాల జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సునీల్ కుమార్, సబ్ ఇంజినీర్ సూర్య ప్రకాష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్



మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గురువారం తహసీలార్ అంటి నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్లాపురం గ్రామ సమీపంలోని దాసరాజు పల్లి చెరువు నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమేష్

మంగపేట: మండలంలోని రామచంద్రునిపేట, దోమెడ, తిమ్మాపురం గ్రామాల్లో ఎఫ్ఎస్‌సీఎస్, ఓడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, డైరెక్టర్ కొమరం బాబుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఓడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ జగన్నాథరావు, స్థానిక రైతులు సమ్మయ్య సంపత్, గోవిందరావు, వెంకట్‌రెడ్డి, వసూరెడ్డి, సంపత్‌రెడ్డి, లక్ష్మయ్య, వీరస్వామి, సోమయ్య, శ్రీనివాస్, రమేష్, శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమ్మాన్‌ను వినియోగించుకోవాలి



వివరాలు వెల్లడిస్తున్న రామ్మూర్తి

ములుగు: కేంద్రం ప్రభుత్వం తపాలా శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న మహిళా సమ్మాన్ పొదుపు పథకాన్ని వినియోగించుకోవాలని సబ్ డివిజనల్ అధికారి సీహెచ్ రామ్మూర్తి సూచించారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలోని తపాలా కార్యాలయంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ కేవలం మహిళలు, ఆడపిల్లల కోసమే ప్రత్యేకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. మిగతా అన్ని పథకాల కంటే అధికంగా వడ్డీ చెల్లింపు ఉంటుందని అన్నారు. అధిక సంఖ్యలో ప్రీమియం తీసుకొని లబ్ధిపొందాలని అన్నారు. రూ.1,000 నుంచి రూ.2లక్షల వరకు ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు. సంవత్సరం దాటిన తర్వాత నుంచి డబ్బులు తీసుకునే వెసులుబాటు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎంఓ అశోక్, ఎస్‌పీఎం ప్రశాంత్, పీఏ రమేష, బీపీఎంలు ఆనందం, నాగరాజు, సుజాత, రజినికాంత్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు

ఏటూరునాగారం: ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ హక్కుల పోరాటాలతో ఏర్పడిన తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి తోలెం కృష్ణయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో గిరిజన, ఆదివాసీ సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగే ఆదివాసీ గిరిజన సంఘం మూడో మహాసభలకు నాయకులు, కళాకారులు, గిరిజన రైతులు తరలివెళ్లామన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, తునికాకు బోనస్ ఇప్పించాలని, ఎస్టీ జానాభా ప్రకారం 8.5 వాతం గిరిజన సంక్షేమానికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తరుణ్, సాగర్, ఎట్టి రామ్మూర్తి, దేవయ్య పగడయ్య, చలపతిలతోపాటు 100మంది కళాకారులు తరలివెళ్లారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



మంగపేట: మండలంలోని కొత్తమల్లూరు (బెస్తగూడెం) గ్రామానికి చెందిన రైతు బట్ట నాగరాజుకు చెందిన దుక్కిటెద్దు విద్యుత్ షాక్‌కు గురై గురువారం మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీగా ఉదయం గ్రామానికి సమీపంలో మిర్చీ తోటల్లోకి వెళ్లిన ఎద్దు చేను వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ స్తంభానికి ఉన్న స్టేవైర్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన దుక్కిటెద్దు విలువ సుమారు రూ.40వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ఎద్దు మృతికి ట్రాన్స్‌కో అధికారులు బాధ్యత వహించి పరిహారం చెల్లించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

బ్యాంక్ సదుపాయాలపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్

టేకుమట్ల: వెలిశాల గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులు గురువారం గ్రామంలోని ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. ఖాతాదారులందరూ బ్యాంకులో తీసుకున్న వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని తెలిపారు. ఖాతాదారులు రూ.435తో టీఎంజీజీబీవీ బీమా చేసుకున్నట్లయితే ఖాతాదారుడు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.రెండు లక్షలు వస్తాయని వివరించారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ రూ.వెయ్యి రూపాయలతో బీమా చేసుకుంటే ఖాతాదారుడు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.20లక్షల బీమా వర్తి స్తుందని వివరించారు. మహిళా సంఘాల బాధ్యులు రుణాలను సకాలంలో చెల్లిస్తే పావులా వడ్డీ చె క్కులను పొందవచ్చని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ మంగేష్, ఫీల్డ్ ఆఫీసర్లు ప్రశాంత్, రవికుమార్, రాజేందర్, గ్రామ దీపిక ఎల్లంకి సుమతి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం: ఆస్పత్రిలో చికిత్సలు పొందిన పలువురు బాధితులకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఎస్ఆర్‌వీ నర్సయ్యకు రూ.60వేల చెక్కు, కె.రాజేశ్వరికి రూ.20వేలు, మహమ్మద్ సఫియా సుల్తానకు రూ.2లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాడి లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు పెద్దబోయిన శ్రీనివాస్, సాగర్, స్వరూప సారయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, గ్రామ పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు కాతం యాదగిరి, ప్రదీప్‌రావు, తాడూరి రఘు, నాగరాజు, ఎగ్గడి కోటయ్య, సాగర్, శ్రీనివాస్, సారయ్య, అల్లి శ్రీనివాస్, బాస పుల్లయ్య, వావిలాల ముత్తయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అనుమతివ్వండి



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాలైన ఆజాంనగర్, పెగడపల్లి గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని ఆజాంనగర్ గ్రామ సర్పంచ్ గోవిందుల రాజమ్మ గురువారం రాష్ట్ర అటవీశాఖ అధికారి(పీసీసీఎఫ్) డోబ్రియాల్‌ను కలిసి కోరారు ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో సర్పంచ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు గోవిందుల శ్యామ్‌లు కలిసి మాట్లాడారు. ఆజాంనగర్ నుంచి పెగడపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. కాగా, అటవీశాఖ అనుమతులు లేవని రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయని సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూత



సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన ఉప్పల కుమారస్వామికి గత ఏడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోగా అతనికి ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఇంటికే శాశ్వతంగా పరిమితం కావడంతో కుటుంబ పోషణ భారంకావడంతోపాటు భార్య శ్రావ్య గర్భిణీ. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆశ్రయించినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఫౌండేషన్ బాధ్యులు రూ.5వేలు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు ఇచ్చినట్లు వైస్ చైర్మన్ సాగర్ తెలిపారు.